సాక్షి
నిర్మల్
గురువారం ၊ 31 ၊ అక్టోబర్ ၊ 2024



అతిథులొస్తున్నాయి..!

మనుగడ కోసం పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంటాయి. ఏటా శీతాకాలం లో కవ్వాల్ టైగర్‌జోన్‌కు వలస వస్తుంటాయి. 8లో▸

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

నిర్మల్‌టౌన్: టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు 1912 టోల్ ఫ్రీ సేవలను మరింత విస్తృత పరిచామని ఎస్ఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 23.0

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హోంగార్డ్ విభాగం సమర్థవంతంగా పనిచేస్తోంది

• ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ నియంత్రణ, క్రైమ్ అన్ని ప్రధాన కార్యాలయాల్లో హోంగార్డు విభాగం ఎంతో సమర్థవంతంగా పనిచేస్తోందని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ సాయుధ దళ ముఖ్య కార్యాలయంలో హోంగార్డ్ ఆఫీసర్స్‌తో పరేడ్, దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నో సమస్యాత్మక పరిస్థితుల్లో, పండుగలు, ఎన్నికల బందోబస్తు, గణేశ్ నిమజ్జనం, ఊరేగింపులాంటి విధుల నిర్వహణలో హోంగార్డుల పాత్ర ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శేఖర్, రాం నిరంజన్, రమేశ్, రామకృష్ణ, ఆర్ఎస్సైలు వినోద్, దేవేందర్, రవికుమార్, రాజశేఖర్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదు



నమోదు పత్రాలు ఇస్తున్న అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి సభ్యత్వ నమోదు రశీదును జిల్లా సీనియర్ నాయకులు రావుల రాంనాథ్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నాయకులంతా క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత నమోదు సమన్వయకర్త సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మ రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షుడు సాధం అరవింద్, నిర్మల్ రూరల్ మండలాధ్యక్షుడు తోకల అనిల్, ఓబీసీ మోర్చా నాయకులు ఆకుల కార్తీక్, ఒడ్నాల రాజు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ విద్యావిధానం అమలు చేయాలి'



విద్యా కమిషన్ చైర్మన్, ఎమ్మెల్సీతో వెంకట్రావు

ఖానాపూర్: తెలంగాణలో జాతీయ విద్యా విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు కోరారు. బుధవారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీతో పాటు ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న సారా సయీద్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సారా సయీద్ ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొని తృతీయస్థానంలో నిలిచింది. కృత్రిమ మేధస్సు–సంభవ్యత–ఆందోళనలు అనే అంశంపై సెమినార్ పేపర్‌ను ప్రజెంట్ చేసింది. బుధవారం ప్రతినిధులు సురేష్ బాబు ఉమారాణి, విశ్వేశ్వరయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధి పాన్నారసం చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుంది.

సంస్థ ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

భైంసాటౌన్: ఆర్టీసీ ఉద్యోగులతో పాటు వారి జీవిత భాగస్వామి ఆరోగ్యం కోసం సంస్థ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం చేపట్టిందని భైంసా డిపో ఇన్‌చార్జి మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్(స్పాజ్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఇంతకుముందు ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం ఉద్యోగి జీవిత భాగస్వామికి కూడా నిర్వహిస్తున్నామన్నారు. మూడురోజులపాటు జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, చందు, సూపరింటెండెంట్ విలాస్, హెడ్ కానిస్టేబుల్ భగవంత్‌రావు, హెల్త్ వాలంటీర్లు అంబదాస్, విజయలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెలుగుల పండుగ

నిర్మల్‌టౌన్: దీపావళి అంటే చీకటిని పారదోలుతూ వెలుగులు విరజిమ్మే పండగ. చెడుపై విజయానికి గుర్తు. చీకటి అజ్ఞానానికి, నిరాశకూ ప్రతీక. కాంతి ఆనందానికి సూచిక. అజ్ఞానమనే చీకటి నుంచి విజ్ఞానమనే వెలుగులోకి పయనింపజేయడమే దీపావళి పండుగ ఉద్దేశం. ఈ పండుగను ఆనందంగా జరుపుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇంటింటా దీపాల వెలుగులతో సందడి నెలకొంది. చిన్నాపెద్ద తేడా లేకుండా బాణాసంచా కాల్చేందుకు సిద్ధమయ్యారు. ఉద్యోగం, ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లిన వారు సైతం సొంతూళ్లకు చేరుకున్నారు. పండుగ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. పూలు, అరటిచెట్లు, మట్టి ప్రమిదలు, పూజాసామగ్రి, పటాకుల దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. వీటితో పాటు షాపింగ్ మాల్స్‌లో కూడా సందడి నెలకొంది.



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- నేడు దీపావళి
- ఇంటింటా సందడి
- అందుబాటులో వివిధ రకాల ఆకృతుల్లో మట్టి ప్రమిదలు
- మార్కెట్‌లో కిక్కిరిసిన జనం

ఆకట్టుకుంటున్న ప్రమిదలు

దీపావళి వేడుకల్లో మట్టి ప్రమిదలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంటిని దీపాలతో అలంకరించడం ఆనవాయితీ. ఈ క్రమంలో వివిధ రకాల ఆకృతులతో తయారు చేసిన ప్రమిదలు మార్కెట్లో లభిస్తున్నాయి. గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుండి ఇవి హైదరాబాద్‌కు దిగుమతి అవుతున్నాయి.

ధరల మోత...

దీపావళిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అన్నిరకాల మార్కెట్లు జనంతో కిక్కిరిసిపోయాయి. దీంతో పండుగ సామగ్రికి ధరల మోత మోగుతోంది. కేవలం పదిరకాల టపాకాయలకు రూ.2 వేల వరకు ఖర్చవుతోంది. రూ.10 నుంచి రూ.10 వేల విలువచేసే టపాసులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. కిలో బంతిపూలు రూ.80 నుంచి 120 వరకు ధర పలుకుతున్నాయి. డజను మట్టి ప్రమిదలు రూ.50 నుంచి రూ.80 వరకు ధర పలుకుతున్నాయి. పేనీలు కేజీ రూ.200 నుంచి రూ.400 వరకు అందుబాటులో ఉన్నాయి.



జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియం ఎదుట బంతిపూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

దీపాలతో అలంకరిస్తాం..



దీపావళి పండుగ విశిష్టమైనది. ఇంటి ల్లిపాది దీపాలు వెలిగిస్తాం. లక్ష్మీదేవిని అలంకరిస్తాం. ఇంటితో పాటు ఆవరణలో బంతిపూలతో అలంకరిస్తాం. లక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తాం. ఇరుగుపొరుగు వారికి పసుపు కుంకుమ ఇచ్చిపుచ్చుకుంటాం. – స్వప్న, గృహిణి, బెస్తవార్‌పేట్

పిల్లలకు ఇష్టమైన పండుగ



దీపావళి అంటే పిల్లలకు చాలా ఇష్టమైన పండుగ. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే నిద్రలేచి తలంటు స్నానాలు చేస్తాం. ఇంటిని పూలతో అలంకరిస్తాం. లక్ష్మీదేవిని అలంకరించి, ఇంటి నిండా దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. పిల్లలతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటాం.

– గన్నేరి రాధిక, పోస్టల్ అసిస్టెంట్, బంగల్‌పేట్



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో టపాకాయల దుకాణాలు

'సరిహద్దు'లో పెద్దపులి గాండ్రింపు!

- సిర్పెల్లి సమీపంలో అరుపులు విన్న స్థానికులు
- అన్వేషణ కొనసాగిస్తున్న అటవీశాఖ అధికారులు



గాలింపు చేపడుతున్న అటవీశాఖ అధికారులు

సారంగపూర్: పెద్దపులి, చిరుత మండలంలోని సహ్యాద్రి పర్వతశ్రేణిపై అటవీ ప్రాంతంలో పులి సంచారం నేపథ్యంలో ప్రత్యేక సిబ్బందితో పాటు డీఆర్‌వో నజీర్‌ఖాన్, టాస్క్‌ఫోర్స్ డీఆర్‌వో రాజశేఖర్, ఎఫ్‌బీవోలు సుజాత, స్వప్న, ప్రవంతి, ఫాజిల్ హుస్సేన్ నాలుగు బృందాలుగా ఏర్పడి స్థానికుల సహకారంతో అడవుల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం సిర్పెల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు పులి గాండ్రించిన శబ్దాలు వినిపించాయని, అందుకే తాము పంటపొలాలకు వెళ్లకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని చెబుతున్నారు. ఒకవైపు చిరుత పులి, మరోవైపు పెద్దపులి సంచరిస్తున్న తరుణంలో ప్రజలు సైతం ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కూలీలు రాక, పత్తిపంటను సేకరించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పెద్దపులి తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోగల దట్టమైన అటవీప్రాంతానికి తరలివెళ్తున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని అటవీశాఖ అధికారులు తెలుపడంతో మండలవాసులకు కాస్త ఊరట లభించినట్లయ్యింది. ఏదిఏమైనా మళ్లీ ఇదేదారిలో మండలంలోని అటవీ ప్రాంతాల్లో ప్రవేశించే అవకాశాలు లేకపోలేదని, ఎటు వెళ్తుందో వేచి చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమీకృతం.. అర్ధంతరం..!

జిల్లాలో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచాయి. జిల్లా కేంద్రంలో ఇప్పటికీ పనులు మొదలు కాకపోగా, భైంసా, ఖానాపూర్ లో సగం వరకు పనులు పూర్తి అయ్యాయి. కాగా ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా మిగిలి ఉన్న పనులపై ప్రభుత్వం అధికారుల నుంచి నివేదిక కోరగా ఈ మేరకు నివేదించారు.



భైంసాలో నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

- కొత్త ప్రభుత్వంలో నిలిచిన పనులు
- రోడ్లపైనే కూరగాయలు, పండ్ల విక్రయాలు
- నిర్మాణాల కొనసాగింపుపై సందిగ్ధం
- నిర్మల్‌లో తాత్కాలిక ఏర్పాట్లకు సన్నద్ధం

భైంసాటౌన్: పట్టణాల్లో వెజ్, నాన్‌వెజ్‌తో పాటు పండ్లు, పూల మార్కెట్లన్నీ ఒకే ఆవరణలో ఉండాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో రూ.7.20 కోట్ల చొప్పున నిధులతో సమీకృత మార్కెట్లు మంజూరు కాగా స్థలం సేకరించి, పనులు సైతం ప్రారంభించారు. నిర్మల్ మినహా, భైంసా, ఖానాపూర్‌లో దాదాపు సగం వరకు పనులు కూడా పూర్తయ్యాయి.

నిలిచిన పనులు...

రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు. ప్రభుత్వం సైతం వీటి గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా జిల్లాలో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు అర్ధాంతరంగానే నిలిచిపోయాయి.

కొనసాగింపుపై స్పష్టత కరువు..

రూ.కోట్ల నిధులతో చేపట్టిన సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. నిర్మాణాల వద్ద కనీసం కాపలా లేకపోవడంతో ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి వస్తువులు, సామగ్రి చోరీకి గురవుతున్నాయి. పనుల కొనసాగింపుపై సైతం ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ఇప్పట్లో అందుబాటులోకి రాకపోవచ్చనే అభిప్రాయం నెలకొంది.

- జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్ పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. దీంతో పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తాత్కాలికంగా కూరగాయల షెడ్డు కోసం రూ. కోటి నిధులు కేటాయించాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. ఈమేరకు బుధవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి హైదరాబాద్‌లో సీఎంకు విన్నవించారు.
- భైంసా పట్టణంతో పాటు ఖానాపూర్‌లో చేపట్టిన సమీకృత మార్కెట్ పనులు మధ్యలోనే నిలిచాయి. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఖానాపూర్‌లో ఇప్పటివరకు పూర్తయిన భవనంలో మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. భైంసాలో మాత్రం మార్కెట్ కోసమే వినియోగించనున్నట్లు సమాచారం.

రోడ్లపైనే విక్రయాలు..

పట్టణాల్లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోగా కూరగాయలు, నాన్‌వెజ్, పండ్లు, పూలు వంటి చిరు వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయాలు జరుపుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు, ఆపై రోడ్ల పక్కనే చిరు వ్యాపారులు అడ్డాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. ముఖ్యంగా పండుగలు, వారసంతల సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులపై ప్రభుత్వానికి నివేదించాం. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, చేపట్టాల్సిన పనులపై నివేదిక అందించాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– అరుణ్, పబ్లిక్ హెల్త్ డీఈఈ, నిర్మల్

సీఎం సార్.. నిధులు కావాలె!

- పట్టణాల్లో ఎన్నో పరేషాన్లు
- రూ.కోట్లాది పనులు పెండింగ్
- ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మున్సిపల్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్: ప్రభుత్వం ఏర్పడి ఏడాది దగ్గర పడుతున్నా.. ఇప్పటికీ నిధులు రాకపోవడంతో జిల్లాలో చాలా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రధానంగా పట్టణాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లలో డబుల్‌బెడ్రూం, అంతర్గత రోడ్లు, డ్రైయినేజీలు, కూరగాయల మార్కెట్ల సమస్యలు నిత్యం ఇబ్బంది పెడుతున్నాయి. నిర్మల్‌లో సమస్యలపై ఫిర్యాదులు పెరిగిపోతుండటంతో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

సీఎం వద్దకు సమస్యలు..

నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిశారు.

- నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి నిలిచిపోయిన టీయూఎఫ్ఐడీసీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.80 కోట్లు విడుదల చేయాలని కోరారు.
- జిల్లా కేంద్రంలో చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్ వరకు చేపట్టిన రోడ్డువెడల్పులో భాగంగా ఇళ్లు నష్టపోయిన 173 మందికి నష్టపరిహారం కింద డబుల్‌బెడ్రూం ఇళ్లను అందించాలని విన్నవించారు.
- స్థానిక గాంధీమార్కెట్‌ను గతంలో సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం చదును చేసిన పాత తహసీల్ కార్యాలయం వద్ద తరలించనున్నామని చెప్పారు. ఇక్కడ తాత్కాలికంగా కూరగాయల మార్కెట్ కోసం రూ.కోటి విడుదల చేయాలని విన్నవించారు.

నిధుల విడుదలకు సానుకూలం..

మున్సిపల్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చేసిన వినతులపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పట్టణ అభివృద్ధికి నిధులు విడుదల, బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ అందించుటకు సహకరిస్తామని సీఎం తెలిపారని చైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్జిత సెలవుల ఉత్తర్వులు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన పాఠశాల విద్యాశాఖకు చెందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు సంపాదిత సెలవుల ఉత్తర్వులు మంజూరు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, చక్రాల హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో కూడా తమ సంఘం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో కూడా సంఘం పక్షాన పాల్గొంటున్నామని, ఉచిత ఓటరు నమోదు కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, రాందాస్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర సర్వే సమయసారిణి మార్చాలి'



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక ఆర్థిక కులగణన సమగ్ర సర్వే సమయసారిణి మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూక్యా రాజేశ్ నాయక్, క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వేలో ప్రధానంగా ఉపాధ్యాయులు పాల్గొంటున్నందువల్ల పాఠశాల సమయం ముగిసిన తర్వాత ప్రక్రియ చేపట్టడానికి రాత్రి సమయం పడుతుందన్నారు. ప్రతీరోజు మధ్యాహ్నం అనంతరం సర్వే చేపట్టేలా సమయాన్ని మార్పు చేయాలని కోరారు. పాఠశాల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. దీనిపై కలెక్టర్‌కు కూడా విన్నవించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు భిక్షపతి నాయక్, సాయన్న, అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం



ఎస్సై దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన దిలావర్‌పూర్ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, జిల్లా పోలీస్ సాయుధ దళ విభాగంలో ఏఆర్ ఎస్సై విఠల్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో యూనిస్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



డీఆర్‌వో భుజంగరావును సన్మానిస్తున్న కలెక్టర్

నిర్మల్: ప్రభుత్వం సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అంశాలపై చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్‌లతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతీ 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేషన్ బ్లాకుగా పరిగణించాలన్నారు. ప్రతీ ఎన్యుమరేషన్ బ్లాకుకు ఒక ఎన్యుమరేటర్ అధికారి బాధ్యుడిగా ఉంటారన్నారు. సర్వేలో నిర్దేశించిన అన్ని వివరాలను సేకరించాలన్నారు. అనంతరం బదిలీపై ఖమ్మం జిల్లాకు వెళ్తున్న డీఆర్‌వో భుజంగరావును కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి



మోడల్ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

నిర్మల్‌ఖిల్లా: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మోడల్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 19 మోడల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో లైబ్రరీలో తెలుగు, ఇంగ్లిషు భాషల్లో మంచి రంగులతో కూడిన పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. చదువుకోవడానికి అనుకూలంగా టేబుళ్లు, పుస్తకాలు అమర్చడానికి ర్యాక్‌లు, విద్యార్థులు గీసిన చిత్రాలు, రాసిన కథలను ప్రదర్శించడానికి పిన్‌బోర్డ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, ఎంఈవో నాగేశ్వరరావు, జిల్లా పరీక్షల అధికారి పద్మ, సెక్టోరియల్ అధికారులు ప్రవీణ్ కుమార్, లింబాద్రి, రూమ్ టు రీడ్ సంస్థ జిల్లా సమన్వయ కర్త గోనె రవి, బ్లాక్ కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్ రెడ్డి, సుధీర్, పోల కావ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నాగార్జున కాలనీలోని ఓ ఇంటిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పూదరి సతీశ్, మూసక ప్రభాకర్, దాసరి చంద్రమౌళి, ఎడ్ల రామారావులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,140 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన సర్వర్ లాలూ(59) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మధుకర్ బుధవారం తెలిపారు. గత కొద్ది రోజులుగా లాలూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నజ్రూల్‌నగర్ ఘటనలో నిందితుల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.5లో ఈనెల 26న జరిగిన ఘటనలో బుధవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామానుజం, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీసు విధులను ఆటంకపర్చినందుకు మనీష్ మానిక్‌దాస్, డెబాశిష్ మండల్, బుద్దేశ్వర్‌రాయ్‌లను అరెస్టు చేశామన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 30 మంది విద్యార్థునులకు ఒక్కసారిగా కడుపునొప్పితో కూడిన విరేచనాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స అనంతరం విద్యార్థినులు పూర్తిగా కోలుకున్నట్లు వైద్యుడు వినయ్ తెలిపారు. విద్యార్థినులు అస్వస్థతకు గల కారణాలు తెలియరాలేదు.

అతిథులొస్తున్నాయి..!



ఈ పక్షిపేరు ఎరుపు అవదావత్ లేదా రెడ్ మునియా పక్షి. ఈ పక్షి ఎస్ట్రీల్డిడే సంతతికి చెందిన పిచ్చుక. ఇది ఉష్ణమండలంలోని ఆసియా ప్రాంతంలో గడ్డి ఎక్కువగా ఉన్న చోట ఉంటుంది. శీతాకాలంలో తమ సంతతిని పెంచుకోవడానికి ఇటీవల కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవుల్లో గల నీటి కుంటలో కనిపించింది.



ఇది ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్. ఆసియాకు చెందిన మధ్యస్థపరిమాణ ప్యాసెరస్ పక్షి. భారత ఉపఖండం, ఆసియా దేశాలలో, మయన్మార్ ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంది. దీని తలపై నల్లని కిరీటం ఆకారంలో జుట్టు ఉంటుంది. ఇది 19 –22 సెం.మీ పొడవు ఉంటుంది. శీతాకాలం ప్రారంభమవుతున్నందున జన్నారం అటవీ డివిజన్‌లోకి వలస వచ్చింది.

భూమిమీద కొన్ని వేల రకాల పక్షి జాతులు ఉన్నాయి. మనుగడ సాగించేందుకు పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తుంటాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సైతం ఏటా శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల పక్షులు వలస వస్తుంటాయి. ప్రస్తుతం శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసియాలోని ఇతర దేశాల నుంచి పక్షులు అతిథులుగా వస్తున్నాయి. ఈ పక్షులు శీతాకాలంలో ఇక్కడే ఉండి తమ సంతతిని పెంచుకుని తిరిగి వాటి ప్రాంతాలకు వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. – జన్నారం

- కవ్వాల్ టైగర్‌జోన్‌లో పక్షుల కిలకిలలు
- ఏటా శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వలస
- అటవీ ప్రాంతంలో 300 రకాల పక్షులు



బ్లాక్ వింగ్‌డ్ కైట్



క్రస్టర్డ్ సర్పెంట్ ఈగల్



ఇండియన్ కోర్మోరెంట్

300 రకాలకు పైగా పక్షులు

వన్యప్రాణులకు నిలయంగా మారిన కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం ఇప్పుడు పక్షులకు ఆవాసంగా మారుతోంది. వన్యప్రాణుల సంరక్షణతో పాటు పక్షి జాతుల సంరక్షణపై అటవీ అధికారులు దృష్టి సారించారు. బర్డ్స్ ఫెస్టివల్‌లో భాగంగా జన్నారం అడవులకు వచ్చిన పక్షి ప్రేమికులు పలు రకాల కొత్త పక్షులను గుర్తించారు. ఈ పక్షుల విశేషాలను అధికారులకు తెలియజేశారు. ఈ క్రమంలో కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశంలో 300లకు పైగా పక్షి జాతులున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 200 రకాల పక్షుల వివరాలను సేకరించారు.

కళ్లముందే అనేక పక్షి జాతులు..

జన్నారం అటవీ డివిజన్‌లో కొంగలు, ఉలీ నెక్‌డ్ స్పార్క్, పిచ్చుకలు, చిలుకలు, వడ్రంగి పిట్ట, చికుముకి పిట్ట, పాలపిట్ట, వల్చర్, అడవి పావురాలు, పిచ్చుకలు, గద్దలు, కింగ్‌ఫిషర్, కోకిల, గోరింకలు, గువ్వలు, బ్లాక్ నెక్‌డ్ పక్షులు ఇలా అనేక రకాల పక్షులు ఉన్నాయి. వీటితో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన 50 రకాల పక్షుల జాతులను కవ్వాల్ టైగర్‌జోన్‌లో గుర్తించినట్లు అధికారులు తెలిపారు.



ట్రికోలర్డ్ మోనియా



వైట్ ఐ బుజర్డ్ పక్షి

మొదలైన వలసలు..

ప్రతీ సంవత్సరం మాదిరి ఈ ఏడాది కూడా పక్షుల వలసలు ప్రారంభమయ్యాయి. ఏటా అక్టోబర్ చివరి వారం నుంచి జనవరి వరకు వివిధ దేశాల నుంచి పక్షులు వచ్చి సంతతిని పెంచుకుంటాయి. అడవిలో నీటి ఆవాసాలు, గడ్డి క్షేత్రాలు ఉండటం వల్ల పక్షులు పెద్ద సంఖ్యలో వలస వస్తున్నాయి. జన్నారం డివిజన్‌లో బైసన్‌కుంట, మైసమ్మ కుంట, ఘనిషెట్టి కుంట, కల్పకుంట, ఉట్నూర్ డివిజన్ ఉడుంపూర్ గాదం చెరువు, కడెం ప్రాజెక్టు, కాగజ్‌నగర్ ప్రాంతాలలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు.



ఆసియన్ పీడ్ స్టార్లింగ్



స్మాల్ మిన్వెట్



చేంజేబుల్ హాక్ ఈగల్

పక్షులను గుర్తిస్తున్నాం



ప్రతీ సంవత్సరం వలస పక్షులు వస్తుంటాయి. తిరిగి వెళ్తుంటాయి.ఏటా పక్షులను గుర్తిస్తాం. ఈ సంవత్సరం పక్షుల వలసలు ప్రారంభమయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పక్షులు తిరిగి ఫిబ్రవరిలో వెళ్తాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం టైగర్‌జోన్ వ్యాప్తంగా వివిధ రకాల పక్షులను గుర్తిస్తున్నాం.

– జోగు ఎల్లం, ఎస్‌టీసీఎస్ సభ్యుడు

వలసలు ప్రారంభమయ్యాయి



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ప్రాంతాలకు వివిధ దేశాల నుంచి పక్షులు వలసలు వస్తుంటాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో సంతతి పెంచుకుని తిరిగి వెళ్తాయి. ఈ సంవత్సరం చలి తక్కువగా ఉన్నందున ఇప్పుడే వలసలు ప్రారంభమయ్యాయి. నవంబర్ మొదటి వారం వరకు అన్ని రకాల పక్షులు ఇక్కడికి చేరుకుంటాయి. పక్షుల రక్షణ కోసం అటవీశాఖ కృషి చేస్తుంది.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

తండ్రి మృతి.. కుమారుడి నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కల్యాణ్‌పాండే

బెల్లంపల్లి: డ్రెయినేజీని మూసివేయడంతో వచ్చిన దుర్వాసన వల్లే తన తండ్రి, సింగరేణి రిటైర్డు కార్మికుడు దయానంద్ ప్రసాద్ పాండే (82) మృతి చెందాడని కల్యాణ్‌పాండే బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీలోని 29వ వార్డు బజారు ఏరియా డబ్బుసేట్‌లైన్‌లో దయానంద్‌ప్రసాద్ పాండే నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో వీధి లోని డ్రెయినేజీని తాత్కాలికంగా మున్సిపల్ సిబ్బంది మూసివేశారు. దీంతో మురికి కాలువలో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండగా, దు ర్వాసనతోనే తన తండ్రి దయానంద్‌ప్రసాద్ పాండే మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడని, డ్రెయినేజీని మూసి ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్యాణ్‌పాండ్ ప్లకార్డు పట్టుకుని ఆందోళన చేశాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కాగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కల్యాణ్‌పాండే ఫిర్యాదు చేశాడు.

దండారీ వేళ కుటుంబంలో విషాదం

- పురుగుల మందు తాగిన అన్నదమ్ములు
- అన్న మృతి, చికిత్స పొందుతున్న తమ్ముడు



మర్సుకోల న్యానేశ్వర్ (ఫైల్)

జైనూర్: ఏజెన్సీ ప్రాంతాల్లో దండారీ ఉత్సవాలు ఘనంగా జరుగుతుండగా మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన ఒక కుటుంబంలో మాత్రం విషాదచాయలు అలుముకున్నాయి. దండారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్ధమైన ఇద్దరు అన్నదమ్ములు చిన్న గొడవతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన మర్సుకోల గంగారాంకు ఇద్దరు కుమారులు న్యానేశ్వర్, శంకర్ ఉన్నారు. గూడమామడ గ్రామానికి చెందిన దండారీ సోనాపూర్‌కు వెళ్తుండగా వీరిద్దరు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న పశువులను మేతకు తీసుకెళ్లేందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా మనస్తాపానికి గురైన వీరు మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి ఆవరణలో వాంతులు చేసుకోవడంతో గమనించిన తండ్రి ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే మర్సుకోల న్యానేశ్వర్(24) మృతి చెందగా, మెరుగైన వైద్యం కోసం మర్సుకోల శంకర్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ బుధవారం తెలిపారు.

స్వగ్రామానికి చేరిన గణేశ్ మృతదేహం



గణేశ్ మృతదేహం

లక్ష్మణచాంద: గత వారం రోజుల క్రితం దుబా య్‌లో మృతి చెందిన ఆ కుల గణేశ్(25) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. మండలంలోని మల్లాపూర్ గ్రా మానికి చెందిన ఆకుల పుష్పలత –పెంటయ్య దంపతుల ఏకైక కుమారుడు గణేశ్ రెండేళ్ల కిందట బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. ఈ నెల 22న కంపెనీలో పని చేసే సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి చొరవతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. భార్య జయశ్రీ, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య గణేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్చోడ: మండలంలోని సాథ్‌నంబర్ వద్ద 44వ జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్ర నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారు ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న సునీల్‌తో పాటు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

విద్యార్థినికి సీఎం ఆర్థికసాయం



సాయిశ్రద్ధకు ఆర్థికసాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి

జైనూర్: నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేదింటి విద్యా కుసుమం సాయిశ్రద్ధకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన మెస్రం న్యానేశ్వర్ –లక్ష్మి దంపతుల కుమార్తె సాయిశ్రద్ధ నీట్‌లో ఎస్టీ కోటాలో 103వ ర్యాంకుతో మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. పేద కుటుంబం కావడంతో కాలేజీలో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సాయిశ్రద్ధ పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం సాయిశ్రద్ధ ఎంబీబీఎస్ పూర్తి అయ్యే వరకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా వైద్యవిద్యకు అవసరమైన పూర్తి మొత్తం ఆర్థికసాయం చేసినట్లు సాయిశ్రద్ధ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): మందమర్రి మండలంలోని కోటేశ్వరరావు పల్లెకు చెందిన సైదం రాజమ్మ(62) అనే వృద్ధురాలు బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సాయంత్రం కాలకృత్యాల కోసం ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూంకు వెళ్లగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

23,10,190

ఇదీ ఉమ్మడి జిల్లా ఓటర్ల సంఖ్య

- పెరిగిన ఓటర్ల సంఖ్య 91,027
- అప్పుడు.. ఇప్పుడు మహిళా ఓటర్లే అధికం
- ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మంచిర్యాలడెస్క్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఓటు నమోదుపై అవగాహన, ఎన్నికల సంఘం, అధికారులు చేపట్టిన కార్యక్రమాలతో ఓటర్ల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటరు ముసాయిదా జాబితా–2024ను విడుదల చేసింది. పది నియోజకవర్గాల్లో మొత్తం 23,10,190మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 11,31,150 మంది పురుష ఓటర్లు, 11,78,906 మంది మహిళా ఓటర్లు, 134 మంది ఇతరులు ఉన్నారు. 2023 ఎన్నికల సమయంలో ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లా ఓటర్ల సంఖ్య 22,19,163 ఉంది. వీరిలో పురుష ఓటర్లు 10,93,381 మంది, మహిళలు 11,25,65మంది, ఇతరులు 126మంది ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటి ఓటరు జాబితా.. ప్రస్తుత ఓటరు జాబితాను పోల్చి చూస్తే 91,027 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. అప్పుడు.. ఇప్పుడు మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ఇతర ఓటర్లలోనూ స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది.

మహిళలే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ప్రతీ ని యోజకవర్గంలోనూ మహిళలే ఎక్కువగా ఉన్నారు. 2023నాటి జాబితా ప్రకారం మహిళా ఓటర్ల సంఖ్య 11,25,656 ఉండగా.. ముసాయిదా జాబితా ప్రకారం 11,78,906కు పెరిగింది. ఈ లెక్కన 53,250 మంది మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది.

జిల్లాల వారీగా..

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కుమురంభీం ఆసిఫాబాద్	2,27,666	2,29,588	31	4,57,285
మంచిర్యాల	3,23,278	3,29,924	45	6,53,247
ఆదిలాబాద్	2,23,176	2,35,154	8	4,58,338
నిర్మల్	3,57,030	3,84,240	50	7,41,320

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	1,14,708	1,14,896	8	2,29,619
ఆసిఫాబాద్(ఎస్టీ)	1,12,958	1,14,692	16	2,27,666
చెన్నూర్(ఎస్సీ)	96,549	98,383	7	1,94,939
బెల్లంపల్లి(ఎస్సీ)	87,800	89,819	12	1,77,631
మంచిర్యాల	1,38,929	1,41,722	26	2,80,677
ఆదిలాబాద్	1,20,382	1,25,855	6	2,46,243
బోథ్(ఎస్టీ)	1,02,794	1,09,299	2	2,12,095
ఖానాపూర్(ఎస్టీ)	1,10,314	1,15,526	13	2,25,853
నిర్మల్	1,22,553	1,37,040	20	2,59,613
ముథోల్	1,24,163	1,31,674	17	2,55,854

బాస్కెట్‌బాల్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వీసీ గోవర్ధన్

భైంసా: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్ అభినందించారు. బుధవారం ఎంపికైన విద్యార్థులతో కలిసి మాట్లాడారు. బాసర క్యాంపస్‌లో క్రీడారంగానికి కి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. క్యాంపస్‌స్థాయిలో ఎంపికైన విద్యార్థులు బెంగుళూర్‌లో జరిగే సౌత్‌జోన్ పోటీల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, శ్యాంబాబు, వసంత, విజయ, రవి, కిరణ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైల్వే జేఈ మృతి



సాయి హిమాన్స్ మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఏరియా పరిధిలోని రైల్వే కాలనీలో విద్యుదాఘాతానికి గురై రైల్వే జూనియర్ ఇంజినీర్ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం దీపావళి పండుగ నేపథ్యంలో సాయి హిమాన్స్ (29) తాను నివాసం ఉంటున్న క్వార్టర్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ఆకస్మికంగా విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త సాయి హిమాన్స్ కళ్లముందే కానరాని లోకాలకు వెళ్లడంతో భార్య అనూష కన్నీరు మున్నీరైంది. వారి స్వస్థలం వరంగల్ జిల్లాలోని రాంపేట గ్రామం. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. మృతుడికి మూడేళ్ల కుమారుడు సాయిరాం ఉన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరస్పరదాడిలో పలువురిపై కేసు నమోదు

బెల్లంపల్లిరూరల్: కుటుంబ కలహాలతో పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో పలువురిపై కేసు నమోదైంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన కమ్మ మనీషా ఆదే గ్రామానికి చెందిన కమ్మ రాజ్‌కుమార్‌ను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరి ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో మనీషా తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి పక్కనే ఆడుకుంటున్న కూతురు సహన్షితో రాజ్‌కుమార్ మాట్లాడుతుండగా భార్య మనీషా, అత్త రాజేశ్వరి దుర్భాషలాడడంతో పాటు రాజ్‌కుమార్, అతని తల్లి వజ్రమ్మలపై దాడికి పాల్పడ్డారు. రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనీషా, రాజేశ్వరిలపై కేసు నమోదైంది. కాగా మనీషా భర్త రాజ్‌కుమార్, మామ భూమయ్య, అత్త వజ్రమ్మ, మరుదులు మహేశ్, రాజశేఖర్‌లు అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు తనపై, తన తల్లి రాజేశ్వరిలపై దాడి చేసి గాయపర్చారని ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.